క్లుప్తంగా

చిన్నారులకు వితరణ



పెదపెంకిలో చిన్నారులకు పంపిణీ చేస్తున్న పుస్తకాలు

బలిజిపేట: భగవాన్ సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా పెదపెంకిలో సాయి మందిరం వద్ద చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు శనివారం పంపిణీ చేశారు. నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో 60మంది చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు కె.అప్పారావు వీటిని అందజేశారు. కార్యక్రమంలో సిహెచ్.వెంకటనాయుడు, పి.తాతబాబు, ఆర్.తమ్మినాయుడు, కె.సాయి, ఇ.మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ



ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మక్కువ: మండలంలోని నందబొడ్డవలస గ్రామ సమీపంలోని శనివారం ఘనంగా ఆంజనేయస్వామి ఆలయం ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తుడు లక్ష్మీనారాయణ తన సొంత నిధులతో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించగా, ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆరవెల్లి విజయ్‌కుమార్‌శర్మ వేద మంత్రోచ్చరణలతో డిప్యూటీ సీఎం రాజన్నదొరకు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

8న వాహనాల వేలం

మక్కువ: సాలూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీన వాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ పాపారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పట్టుబడ్డ ఏడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వాహనాల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

జగనన్న ఎంఐజీ లేఅవుట్‌ను పరిశీలించిన ఎస్‌ఈ



సాలూరులో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ రాజారావు

సాలూరు/మక్కువ: పట్టణంలోని ఉద్యోగుల కోసం నిర్మించనున్న జగనన్న ఎంఐజీ లేఅవుట్‌ను పబ్లిక్ హెల్త్ విశాఖపట్టణం సూపరెంటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ పి.రాజారావు శనివారం పరిశీలించారు. సుమారు రూ.5లక్షలతో ప్రస్తుతం లేఅవుట్‌లో జరుగుతున్న కాలనీ లెవెలింగ్, ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. కాలనీలో మంచినీటి సదుపాయం, రహదారులు, కాలువలు ఏర్పాటుకు అవసరమైన ప్రదేశాన్ని పరిశీలించారు. జగనన్న ఎంఐజీ లేఅవుట్‌లో నాణ్యతతో కూడిన పనులు జరిపించాలన్నారు. పనులు వేగవంతంగా జరిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాల్టీ కమిషనర్ అనుమంత శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే జరిగిన భూముల్లో 12లోగా సర్వే రాళ్లు



రోవర్‌తో భూమి హద్దులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలో మొదటి విడతలో భూ రీసర్వే పనులు పూర్తి చేసిన భూముల్లో ఈ నెల 12లోగా సర్వే రాళ్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. మరిపివలస, చిన్నారాయుడుపేట, గుచ్చిమి గ్రామాల్లో జరుగుతున్న సర్వే రాళ్లు వేస్తున్న ప్రాంతాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఆర్డీవో కె.హేమలత పర్యవేక్షణలో గ్రామ సర్వేయర్లు వీఆర్వోలు, సంయుక్తంగా ప్రభుత్వం మంజూరు చేసిన 8 రోవర్లతో పనులు చేసి సర్వే రాళ్లు వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ 3,650 సర్వే రాళ్లు భూముల సరిహద్దుల్లో వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి.చిట్టిమ్మ, మండల సర్వేయర్ గౌరీశంకరరావు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రజలకు వరం



మావుడిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు/మక్కువ: సచివాలయ వ్యవస్థ ప్రజలకు గొప్ప వరం వంటిదని గిరిజన శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలం మావుడి గ్రామంలో గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ సీఎం రాజన్నదొర శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ప్రజలకు చేరువగా సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రజలు తిరగకుండా, ఆయా పంచాయతీల పరిధిలో సచివాలయం ద్వారా ప్రజలు తమ, తమ పనులు జరిపించుకునేందుకు వీలుగా ఉండేందుకు చక్కటి వేదిక సచివాలయమన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటకీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. సచివాలయం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పీడిక సుదర్శనరావు, కొండతామర నరసింహులు, ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీడీఓ జి.పార్వతి, ఎంపీటీసీ మర్రి ఆదయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీను, జేసీఎస్ చైర్మన్ కె.త్రినాధరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌లో నమోదు తప్పనిసరి : ఏపీడీ



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీడీ సత్యంనాయుడు

పార్వతీపురం టౌన్: వెలుగు సంస్థ నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలు లోకోస్ యాప్‌లో నయోదు తప్పనిసరని వెలుగు ఏపీడీ సత్యంనాయుడు అన్నారు. నమోదులో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానంలో ఉండాలని ఆయన అన్నారు. శనివారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను బీమా పథకంలో చేర్చాలని, అప్పులు మంజూరు చేసి వారికి జీవనోపాధి కల్పించాలన్నారు. బీమా నమోదు ప్రక్రియలలో సిబ్బంది ఎటువంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రతీ మండలంలో మహిళా మార్టులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. శ్రీనిధి రుణాల పురోగతిపై ఆరా తీసి వాటి సంఖ్యను పెంచేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎంలు, ఏపీఎంలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



మావుడి గ్రామంలో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు/మక్కువ: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు మండలంలోని మావుడి సచివాలయ పరిధి మావుడి, కొట్టిపరువు పంచాయతీలకు చెందిన మావుడి, కొత్తవలస, పురిగానివలస, సోమడవలస, ఎరగడవలస, గాదిపల్లివలస, చింతలవలస గ్రామాలలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు ఎంతెంత మొత్తం లబ్ధి చేకూరిందో డిప్యూటీ సీఎం రాజన్నదొర వివరించారు. సీఎం సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను అందించారు. మావుడి గ్రామంలో ఇంటింటికి కుళాయి, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. వెంటనే స్పందించిన గిరిజన శాఖ మంత్రి రాజన్నదొర రెవెన్యూ అధికారులను తగు చర్యలకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ కుటుంబానికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మావుడి, కొట్టిపరువు సర్పంచ్‌లు పీడిక సుదర్శనరావు, కొండతామర నరసింహులు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి, ఎంపీటీసీ సభ్యుడు మర్రి ఆదయ్య, ఎంపీడీఓ జి.పార్వతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీను, జేసీఎస్ చైర్మన్ కె.త్రినాధరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

సాలూరు/మక్కువ: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో 84శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ బి.రాజకుమార్ తెలిపారు. సాలూరు మండలంలోని 25 పాఠశాలలకు చెందిన 1353మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా, వారిలో 1137మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.

పాచిపెంటలో 86.62 శాతం

పాచిపెంట: మండలంలోని 10వ తరగతి ఫలితాల్లో మొత్తం 11 పాఠశాలల్లో 86.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జోగారావు తెలిపారు. పాంచాలి పాఠశాలకు చెందిన పెనుమజ్జి మణికంఠ తన సత్తా చాటాడు.

మక్కువలో..

మక్కువ: ప్రభుత్వం శనివారం విడుదల చేసిన పదవతరగతి ఫలితాల్లో మక్కువ మండలం విద్యార్థులు మెరిసారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 173మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 129మంది విద్యార్థులు ఉత్తీర్ణలైనట్లు హెచ్ఎం దేవి తెలిపారు. పాఠశాలకు చెందిన పద్మావతి, విజయలక్ష్మి ప్రతిభ చాటారు. మండలంలోని ములక్కాయవలస మోడల్ పాఠశాలకు చెందిన 97మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 79మంది ఉత్తీర్ణలైనట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. పాఠశాలకు చెందిన గణేష్, మౌళిక ప్రతిభ చాటారు.

శతశాతం ఉత్తీర్ణత

పార్వతీపురం టౌన్: మండలంలోని 26 పాఠశాలల్లో 1549 విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 1335మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 663 మంది, బాలికలు 662మంది ఉత్తీర్ణత సాధించి 86.18శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ప్రసాదరావు తెలిపారు. మండలంలో ఏడు జెడ్పీ ఉన్నత పాఠశాలలు శతశాతం ఉత్తీరత సాధించాయి. మండలంలోని 591 మార్కులు నారాయణ స్కూల్‌కు చెందిన వై.హేనుజ, పి. ప్రణీత సాధించినట్లు తెలిపారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల హవా

బలిజిపేట: పది ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ పాఠశాలలు హవా కొనసాగించాయి. వంతరాం ఉన్నత పాఠశాలకు చెందిన డి.ఉమామహేశ్వరి మండల స్థాయిలో సత్తా చాటింది. బలిజిపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.ఉమామహేశ్వరి, అరసాడ ఉన్నత పాఠశాలకు చెందిన జి.స్రవంతి సత్తా చాటారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో 153మందికి 144మంది ఉత్తీర్ణులయ్యారు. వంతరాం ఉన్నత పాఠశాలలో 57మందికి 43, నారన్నాయుడువలసలో 41మందికి 24, చిలకలపల్లిలో 28మందికి 25, అజ్జాడలో 24మందికి 14, నారాయణపురంలో 35మందికి 32, అరసాడలో 19మందికి 17, కేజీబీవీలో 25మందికి 20, పెదపెంకి ఉన్నత పాఠశాలలో 44మందికి 42మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రతిభ కనబర్చిన ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు

సీతానగరం: ప్రభుత్వం శనివారం ప్రకటించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో బాలురు కన్నా బాలికలే ఎక్కువ మంది ఉత్తీర్ణులయ్యారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో 53 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనగా 49 మంది ఉత్తీర్ణులు కాగా తెలుగు మీడియంలో 34 మంది పరీక్షల్లో పాల్గొనగా 21 మంది ఉత్తీర్ణులయ్యారు.

రూపాయికే ఇల్లు ఇచ్చిన ఘనత సీఎం జగనన్నదే..



లబ్ధిదారులతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురం టౌన్: ఒక్క రూపాయికే ఇల్లు ఇచ్చిన ఘనత సీఎం జగనన్నదేనని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పట్టణంలోని కొత్తవలసలో ప్రభుత్వ పథకాలు పొందిన లబ్ధిదారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో 768 టిడ్కో ఇళ్లను అన్ని సదుపాయాలతో అక్కాచెల్లమ్మల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసి ఒక్కరూపాయికే అందిస్తామన్నారు. సెప్టెంబరు నెల నాటికి అందరికి ఇళ్లు అందివ్వడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులకు ఉపాధి



ఏగోటివలసలో వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డులున్న వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించడం జరుగుతుందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఏగోటివలసలోని గురినాయుడు చెరువులో ఉపాధి వేతనదారుల మస్తర్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పని కావాల్సిన వారికి జాబ్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. జాబ్ కార్డులున్న కుటుంబాలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పనుల్లో పాల్గొనే వారు విధిగా మస్తరు వేయించుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేపట్టడం జరుగుతోందని ఏపీఓ భాను పర్యవేక్షణలో శనివారం 10,139 మంది వేతనదారులకు పని కల్పించినట్టు తెలిపారు. టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిరోధించాలి

- మండల ప్రత్యేకాధికారి వైవీ శ్యామ్‌కుమార్



సఖి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సభ్యులు

బొబ్బిలి: బాల్య వివాహాలను నిరోధించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి, మార్కెటింగ్ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వైవీ శ్యామ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.డి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో అంగన్‌వాడీ, వైద్య, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న వయసులో వివాహాలు చేస్తే కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సీడీపీఓ ఎం. విజయలక్ష్మి, వైద్యులు సంతోష్‌కుమార్, రమేష్, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు..

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి వైవీ శ్యామ్ కుమార్ అన్నారు. మండలంలోని పారాది జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు బిల్లులు వెంటవెంటనే చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, హౌసింగ్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సంతకవిటి: కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, మహిళా పోలీసులతో 'సఖి' సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కిశోరి బాలికల్లో రక్తహీనత లేకుండా, హిమోగ్లోబిన్ శాతం తగ్గకుండా చూడాలని తెలిపారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

బీటీ రోడ్లుగా మార్చుతున్నాం.. : ఎమ్మెల్యే



శివరాంపురం రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: మండలంలోని అన్ని రహదారులను బీటీ రోడ్లుగా రూపురేఖలు మార్చుతున్నామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. శివరాంపురం బీటీ రోడ్డు నిర్మాణాన్ని ఆయన శనివారం పరిశీలించారు. గత ప్రభుత్వంలో చేయని అభివృద్ధి పనులను చేసి చూపిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో ఉండే ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా అత్యవసరమైన రహదారి నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందుకు రూ.కోట్ల విలువైన బీటీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. శివరాంపురం నుంచి అరసాడ జంక్షన్ వరకు ఉండే 2.25 కిలోమీటర్ల రహదారికి రూ.2కోట్లతో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, శివరాంపురం సర్పంచ్ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, కె.వెంకటరమణ, టి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న మండల సమాఖ్య కోశాధికారి గౌరి

సీతానగరం: పొదుపు సంఘాలను బలోపేతం చేయడం ద్వారా సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వీఓఏలు పని చేయాలని మండల సమాఖ్య కోశాధికారి గౌరి అన్నారు. వెలుగు సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం రెడ్డి శ్రీరాములు అధ్యక్షతన వీఓఏల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘ సభ్యులు వ్యాపారం చేయడానికి ఇంతవరకు రూ.50 వేల స్త్రీనిధి రుణం పొందేవారి, తాజాగా రూ.లక్ష రుణం పొందడానికి వీలు కల్పిస్తూ మార్గదర్శకాలు వచ్చాయన్నారు. దీంతో వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. మహిళా మార్టులు ఏర్పాటు చేసేందుకు సభ్యులంతా సభ్యత్వం తీసుకుని లబ్ధిదారుని వాటా రుసుం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీఏ శ్రీరాములు మాట్లాడుతూ ఇప్పటికే అన్ని గ్రామాల్లో పొదుపు సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి మహిళా మార్టులు ఏర్పాటుపై అవగాహన కల్పించామన్నారు, వెలుగు సీసీలు, సిబ్బంది, గ్రామఖ్య సంఘాల వీఓఏలు పాల్గొన్నారు.

నర్సిపురం గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్'



నర్సిపురం గ్రామంలో గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి తిరుమల ప్రసాద్

పార్వతీపురం టౌన్: ప్రతీ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులకు, వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ నెలకు రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అందుబాటులో 62రకాల మందులు అందుబాటులోఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచాన పడి వున్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్ల వద్దనే వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

తల్లి సమాధి వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే



తల్లి సంతోషమ్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, కుటుంబీకులు

బలిజిపేట: మాజీ ఎంపీపీ అలజంగి సంతోషమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా చిలకలపల్లిలో ఆమె సమాధి వద్ద కుమారుడు ఎమ్మెల్యే అలంగి జోగారావు శనివారం ఘనంగా నివాళులర్పించారు. సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు కుటుంబీకులు, సోదరుడు మండల జెడ్పీటీసీ ఎ.రవికుమార్‌తో సహ కుటుంబీకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోషమ్మ సేవలను పలువురు కొనియాడారు. మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో నో యాక్సిడెంట్ డే



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

పార్వతీపురం టౌన్: ఓవర్‌లోడ్ వాహనాలపై చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఆటోలు నడిపేటప్పుడు పరిమితికి మంచి లోడ్ ఉంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎక్కువ స్పీడ్‌తో వెళ్లరాదని, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు వెంట ఉంచాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఏఎస్ఐ రాజారావు, కిషోర్, సంవత్, ఆటో డ్రైవర్‌లు, వాహనచోదకులు పాల్గొన్నారు.

సీఎం ఆశయానికి అనుగుణంగా మ్యాపింగ్

- లేకుంటే చర్యలు
- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న పార్టీ నాయకులు

సాలూరు/మక్కువ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ఆస్పత్రుల మ్యాపింగ్ జరగాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరు నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు రాజన్నదొరను శనివారం కలిశారు. ఆస్పత్రుల్లో మ్యాపింగ్ సక్రమంగా అధికారులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ పేదలకు మంచి చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అధికారులు ఆయన ఆశయానికి అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రజలకు, రోగులకు ఇష్టమైన, సదుపాయం కల్గిన పీహెచ్‌సీల్లో మాత్రమే మ్యాపింగ్ చేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలను ఆయా పీహెచ్‌సీలో మ్యాపింగ్ చేస్తే, రోగులు వైద్యసేవలు పొందేందుకు సులువుగా ఉంటుందన్నారు. మెంటాడ మండలంలోని జక్కువ పంచాయతీ, చల్లపేట పీహెచ్‌సీకి దగ్గరలో ఉందని, అక్కడ మ్యాపింగ్ చేయకుండా, మెంటాడ పీహెచ్‌సీలో మ్యాపింగ్ చేస్తే రోగులకు కష్టమవుతుందన్నారు. సాలూరు మండలం జిల్లెడువలస పంచాయతీ తోణం పీహెచ్‌సీ పరిధిలో ఉండగా, మామిడిపల్లి పీహెచ్‌సీలో మ్యాపింగ్ చేస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. మక్కువ మండలం డి.శిర్లాం పంచాయతీ మక్కువ పీహెచ్‌సీ దగ్గరగా ఉండగా, శంబర పీహెచ్‌సీలో మ్యాపింగ్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంతో ఆయా పంచాయతీల ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. కొంతమంది వైద్యాధికారులు పని ఒత్తిడి ఎక్కువగా ఉందన్న నెపంతో, పలు పంచాయతీలకు చెందిన రోగులను పీహెచ్‌సీలకు రావద్దని చెబుతున్నట్లు తెలుస్తుందని, రోగుల కోసం పని చేస్తున్నామన్న వైద్యులు విషయం గ్రహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలో మాత్రమే పంచాయతీలను మ్యాపింగ్ చేయాలని, వైద్యాధికారులకు నచ్చిన విధంగా మ్యాపింగ్ జరిపిస్తే సీరియస్‌గా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు ఒత్తిడి తెస్తే, వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మ్యాపింగ్ విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచించారు.